సాక్షి జనగామ

మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



భక్తులకు శుభవార్త

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది.

- 8లో▸



ఎరుపెక్కిన ఏనుమాముల..

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సోమవారం మిర్చితో ఎరుపెక్కింది. రైతులు విక్రయానికి భారీ మొత్తంలో మిర్చిని తీసుకొచ్చారు.

- 8లో▸



వాతావరణం

ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. అధిక వేడి, ఉక్కపోత ఉంటుంది. రాత్రి పూట చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

యూరియా కొరత లేదు



నర్మెట: ప్రస్తుతం సాటు చేసిన పంటలకు యూరియా కొరత లేదు.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వ్యవసాయ అధికారి రామారావు నాయక్ అన్నారు. స్థానిక ఫర్టిలైజర్ షాపులను సోమవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వంద మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అవసరమైన రైతులు కొనుగోలు చేయవచ్చని చెప్పారు. అధికారి వెంట ఏఓ మనోహిత్ విక్రమ్‌రావు తదితరులు ఉన్నారు.

48 గంటలు వైన్స్ బంద్

జనగామ: ఖమ్మం–వరంగల్–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం(నేడు) సాయంత్రం 4 గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు 48 గంటల పాటు జిల్లాలో మద్యం దుకాణాలు మూసి వేస్తున్నారు. దీంతో బీర్లు, లిక్కర్ సేల్ ఒక్కసారిగా పెరిగింది. బెల్ట్ దుకాణాదారులు రోజువారీ కంటే అదనపు స్టాక్ సమకూర్చుకుంటున్నారు.

ఆక్రమించుకున్న భూమి దళితులకు ఇప్పించాలి



పాలకుర్తి టౌన్: మండల పరిధి మంచిప్పుల గ్రామంలో దళితుల భూములను ఆక్రమించుకున్నవారి నుంచి తిరిగి ఇప్పించాలని సాధిక్ ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది సాధిక్ అలీ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లో ఆయనకు వినతి పత్రం అందజేశారు. దళితుల భూముల్లో గత ప్రభుత్వం అక్రమంగా డబుల్ బెడ్రూంలు నిర్మించిందని, వాటిలో బాధితులు తల దాచుకుంటే.. ఆ ఇళ్లకు కరెంటు, తాగునీరు ఇవ్వకుండా పోలీసులు వేధిస్తున్నారని సాధిక్ అలీ పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ చైర్మన్ మంచుప్పుల గ్రామాన్ని సందర్శించాలని కోరారు. ఆయన వెంట దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర సభ్యులు శంకర్, తదితరులున్నారు.

హస్తకళలతో స్వయం ఉపాధి



స్టేషన్‌ఘన్‌పూర్: హస్తకళలను నేర్చుకోవడం ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందాలని ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ టి.శ్రీనివాస్‌రావు అన్నారు. హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కమిషనర్, ఏపీ ప్రొడక్టివిటీ కౌన్సిల్ ఆధ్వర్యాన హస్తకళల శిక్షణ తీసుకున్న మహిళలకు స్థానిక ఎస్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం 'బాబిన్ లేస్ క్రాస్ స్టిచ్'పై ఒక్కరోజు సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసరావు మాట్లాడుతూ.. హస్తకళల అభివృద్ధికి ఏపీసీసీ ద్వారా ప్రత్యేక చొరవతో పనిచేస్తున్నామని, ఆసక్తి ఉన్న మహిళలకు హ్యాండీక్రాఫ్ట్‌లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. బాబిన్ లేస్ కళ అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమాలతో పాటు వెబ్‌సైట్ తయారు చేస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని మహిళలు వినూత్న డిజైన్లతో ఆకట్టుకుంటూ మార్కెటింగ్ రంగంలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో జాతీయ సలహాదారుడు హెచ్‌కే.చారి, పీడీ సుధీర్‌కుమార్, ఖాజామొయినొద్దీన్, విజయసాగర్‌రెడ్డి, శ్రీధర్, హస్తకళాకారులు జీడి ప్రసాద్, నీరటి శోభ, ఎడ్ల సులోచన, విమల, నిర్మల, తేరీజ, యాదమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.

'పన్ను కట్టు.. గిఫ్ట్ పట్టు'

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

ఇంటి, నల్లా పన్ను వసూళ్లలో వందశాతం లక్ష్యం మార్చి 31 వరకు చేరుకున్న ఐదుగురు ఉద్యోగులు, సిబ్బందికి ఏప్రిల్ 1వ తేదీన ఉత్తమ అవార్డుతో పాటు నగదు బహుమతి అందిస్తామని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పేర్కొన్నారు. అలాగే పన్ను చెల్లింపులో ముందు వరుసలో ఉన్న యజమానుల రశీదులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి మార్చి 8న బహుమతులు ఇస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరూ పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి తోడ్పాటును అందించాలని ఆయన కోరారు.





బకాయిలు ఫుల్.. వసూళ్లు పూర్



మున్సిపల్ పాలన అస్తవ్యస్తం

- మొద్దు నిద్రలో అధికార యంత్రాంగం
- సీడీఎంఏ మందలించినా మార్పు లేదు
- తరుముకొస్తున్న మార్చి 31 డెడ్‌లైన్
- రంగంలోకి దిగిన కలెక్టర్ రిజ్వాన్ బాషా
- 'పన్ను కట్టు.. గిఫ్ట్ పట్టు'
- ఉద్యోగులు, యజమానులకు నజరానా

జనగామ: పురపాలిక అభివృద్ధి, ప్రజలకు మౌలిక వసతుల కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో పాటు ఆస్తి, నల్లా పన్నులు ఎంతో కీలకం. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పట్టింపులేని తనం కారణంగా మున్సిపల్ పాలన అస్తవ్యస్తంగా తయారైంది. వార్డుల్లో ప్రజలకు కనీస మౌలిక వసతి సౌకర్యాలపై దృష్టి పెట్టాల్సిన అధికారులు.. వాటిని విస్మరించారు. పురపాలికకు రావలసిన పన్నుల వసూలుపైనా పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారు. సీడీఎంఏ అధికారులు మొట్టికాయలు వేసినా.. కలెక్టర్ హెచ్చరించినా ఫలితం కనిపించడం లేదు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి నెల ఐదురోజులు మాత్రమే మిగిలి ఉంది. ఇప్పటి వరకు పన్ను డిమాండ్‌లో 40 శాతం కూడా వసూలు కాలేదు. దీంతో కలెక్టర్ రిజ్వాన్ బాషా రంగంలోకి దిగాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జనగామ మున్సిపల్ పరిధిలో గృహాలు, వాణిజ్య సంస్థలు 15,414 అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఆస్తి పన్ను డిమాండ్ రూ.5.71కోట్ల మేర ఉంది. ఇప్పటి వరకు రూ.2.27కోట్లు(39.80శాతం) మాత్రమే వసూలు చేశారు. రూ.3,43,89,000 రావాల్సి ఉంది. పురపాలిక 30 వార్డుల పరిధిలో 13,696 నల్లా కనెక్షన్లు ఉన్నాయి. ఏటా పన్ను డిమాండ్ రూ.1.66 లక్షలు ఉంటుంది. ఇప్పటి వరకు రూ.18.22లక్షలు(10.95) మాత్రమే వసూలైంది. రూ.1.48కోట్ల మేర బకాయి ఉంది. ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో నెల ఐదు రోజులు మాత్రమే మిగిలి ఉంది.

పదేళ్లు.. 11 మంది కమిషనర్లు

పురపాలన అస్తవ్యస్తంగా మారడానికి ముఖ్యంగా కమిషనర్లు కుదురుగా లేకపోవడం కారణంగా చెప్పవచ్చు. 2014 నుంచి ఇప్పటి వరకు 10 మంది కమిషనర్లు బదిలీ అయ్యారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నవారు.. ఏసీబీ ట్రాప్‌లో చిక్కిన వారు.. రెగ్యులర్ అధికారులు ఇందులో ఉన్నారు. 2014 నుంచి 2016 వరకు కమిషనర్ సత్యనారాయణ, 2016–17 కె.బలరాం, 2017–18 ఈశ్వరయ్య, 2018లో ఒక నెల పాటు అప్పటి డీఈ కె.రవికిరణ్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చారు. 2018–20 నోముల రవీందర్, 2020–21 సమ్మయ్య, 2021లో రెండు నెలలు డీఈ చంద్రమౌళికి ఇన్‌చార్జ్ బాధ్యతలు, 2021–22 వరకు నర్సింహ పని చేశారు. 2022 నుంచి 7 నెలల పాటు రవీందర్‌యాదవ్ పనిచేయగా, 2022–23 వరకు రజిత బాధ్యతలు నిర్వర్తించి ఏసీబీకి పట్టుబడ్డారు. ఆ తర్వాత ప్రస్తుత కమిషనర్ ఖమ్మం నుంచి ఇక్కడికి వచ్చారు.



ఆస్తి పన్నుల వివరాలు:

అసెస్ మెంట్లు	: 15,414
పన్ను డిమాండ్	: రూ.5.71 కోట్లు
ఇప్పటికి వసూలైంది	: రూ.2.27 కోట్లు
బకాయి	: రూ.3.44 కోట్లు

నల్లా పన్ను వివరాలు:

ట్యాప్ కనెక్షన్లు
13,696

పన్ను డిమాండ్
రూ.1.66 కోట్లు

వసూలైంది
రూ.18.22 లక్షలు

బకాయి
రూ.1.48 కోట్లు



సర్కారు శాఖలపై దృష్టేది..?

వివిధ ప్రభుత్వ శాఖల నుంచి పురపాలికకు ఆస్తి పన్ను రూ.1.09కోట్ల మేర రావాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయాల నుంచి పన్ను వసూలు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. సామాన్య ప్రజలు ఏడాది పన్ను పెండింగ్ ఉంటే.. ఇంటి వద్దకు వెళ్లి హడావుడి చేసే సిబ్బంది.. సర్కారు కార్యాలయాలు ఏళ్ల తరబడి చెల్లించకున్నా ఎందుకు మినహాయింపు ఇస్తున్నారనే ప్రశ్నను ప్రజలు లేవనెత్తుతున్నారు. తహసీల్ కార్యాలయం రూ.17.38 లక్షలు(1997–98 నుంచి), జిల్లా ఆస్పత్రి(రూ.3.39లక్షలు(1996–97 నుంచి), ఆర్అండ్‌బీ అతిథి గృహం రూ.5.12 లక్షలు(2005–06 నుంచి), పంచాయతీ రాజ్ రూ.8.47 లక్షలు(2006–07 నుంచి), ఎంపీడీఓ, జెడ్పీ రూ.10.24 లక్షలు(2013–14 నుంచి), పీడబ్ల్యూడీ ఐబీ రూ.1.49 లక్షలు (2000–01 నుంచి), వ్యవసాయ మార్కెట్ రూ.6.79 కోట్లు (2022–23 నుంచి), గోదాంలు రూ.12,230 (2024–25 నుంచి), వీవర్స్ కాలనీ లోని హ్యాండ్లూ, టెక్స్‌టైల్స్ కార్యాలయం రూ.54,788 (2023–24 నుంచి), కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసు రూ.4.98లక్షలు (1995–96 నుంచి), హౌసింగ్ బోర్డు రూ.2.88లక్షలు(2002–03 నుంచి), ఆర్టీఓ కార్యాలయం రూ.8.75లక్షలు(2009–10నుంచి), గిర్నిగడ్డ గోదాం రూ.4.53 లక్షలు (2015–16 నుంచి), పోస్టాఫీస్ రూ.5.84లక్షలు (2004–05 నుంచి), బీఎస్ఎన్ఎల్ రూ.8.84లక్షలు (2019–20 నుంచి), ఆర్టీసీ రూ.3.22లక్షలు (2024–25 నుంచి), అటవీ శాఖ రూ.7.39 లక్షలు (2002–03 నుంచి), ఐసీడీఎస్ రూ.1.09లక్షలు (2017–18 నుంచి), సోషల్ వెల్ఫేర్ రూ.48,156 (2023–24).. ఇలా మరికొన్ని శాఖల నుంచి పురపాలికకు ఆస్తి పన్ను బకాయిలు పెద్ద ఎత్తున ఉన్నాయి.

నేటి నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు



పాలకుర్తి టౌన్: పాలకుర్తి శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం(నేడు) నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టామని ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు తెలిపారు. మార్చి ఒకటో తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, 26న స్వామివారి కల్యాణం, 27న రథోత్సవం, బండ్ల తిరుగుట, 28న డోలారోహణం, వసంతోత్సవం, మార్చి ఒకటిన అగ్నిగుండాలతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు.

మెట్ల మార్గం నుంచి మాత్రమే అనుమతి

మహా శివరాత్రి రోజు మెట్లమార్గం నుంచి మాత్రమే అభిషేకం, ధర్మ దర్శనానికి అనుమతి ఉంటుంది.. స్వామివారి దర్శనం అనంతరం భక్తులు ఘట్‌రోడ్డు మార్గం ద్వారా కిందికి వచ్చేలా ఏర్పాటు చేశామని ఈఓ తెలిపారు. వృద్ధులు, దివ్యాంగులకు ఆరు ఆటోల ద్వారా ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని చెప్పారు. స్వామివారి కల్యాణం టికెట్ రూ.2016, అభిషేకం రూ.500(సామగ్రితో), వీఐపీ దర్శనం టికెట్ రూ. 1,000 చెల్లించి కౌంటర్‌లో టికెట్ పొందాలని సూచించారు. ఈ సందర్భంగా ఆలయంలో చేపట్టిన ఏర్పాట్లను సోమవారం ఏసీపీ అంబటి నర్సయ్య, సీఐ గట్ల మహేందర్‌రెడ్డి పరిశీలించారు.

శివరాత్రికి ముస్తాబైన ఆలయాలు 9లో▸

కేసుల పరిష్కారానికి సహకరించాలి



సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తులు, పోలీసు అధికారులు

- జనగామ సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

జనగామ రూరల్ : జిల్లాలో అపరిష్కృత పెండింగ్ కేసుల పరిష్కారానికి అనుబంధ యంత్రాగం సహకరించాలని జనగామ సీనియర్ సివిల్ జడ్జి ఇ.విక్రమ్ అన్నారు. సోమవారం పట్టణంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో పోలీసు అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జడ్జి విక్రమ్ మాట్లాడారు. మార్చి 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా పాటుపడాలన్నారు. రాజీ పడతగిన క్రిమినల్, సివిల్ కేసుల్లో న్యాయవాదులతో పాటు కక్షిదారులు సామరస్యంగా సెటిల్ చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఇ.సుచరిత, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.శశి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎనగందుల చంద్రఋషి తదితరులు పాల్గొన్నారు.

పెద్దబాయితండా పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

అధికారికి కూడా నోటీస్ జారీ

కొడకండ్ల : మండల పరిధి పెద్దబాయితండా జీపీ కార్యదర్శి కె.సోమేశ్వర్‌ను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ రిజ్వాన్ బాషా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధులపై నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ పంచాయతీ కార్యదర్శి, ప్రత్యేక అధికారిపై మాజీ సర్పంచ్, ఉపసర్పంచ్, స్థానిక గిరిజనులు ఈనెల 14న జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశం మేరకు డీపీఓ స్వరూప విచారణ చేపట్టగా జీపీ రికార్డులు అప్‌డేట్ లేకపోవడం.. నిబంధనల మేరకు సమావేశాలు, గ్రామసభలు నిర్వహించకపోవడం.. కొన్ని రిజిస్టర్లు అందుబాటులో లేకపోవడం.. రశీదు బుక్‌లో మొత్తం రూ.3,73,633 వసూలు చేసి రూ.1,82,900 మాత్రమే జమచేసి మిగతా మొత్తం చేతి నిల్వగా ఉన్నట్లు గుర్తించారు. అలాగే ఖర్చుల నిమిత్తం తీర్మానాలు, రికార్డులు లేకుండా చెక్కుల ద్వారా చెల్లించారనే ఆరోపణలపై డీపీఓ పరిశీలించారు. బండారి నాగరాజు అనే వ్యక్తి అకౌంట్‌కు గ్రామ పంచాయతీకి చెందిన వివిధ ఖాతాల నుంచి రూ.11,93,388 జమ చేయడం, ఇందిరమ్మ ఇళ్ల సర్వే అస్సెస్‌మెంట్‌కు ఆన్‌లైన్ కాకుండా ఒక్కొక్కరి వద్ద రూ.3,500 చొప్పున మొత్తం రూ.1,43,500 వసూలు చేసినట్లు రశీదుల ద్వారా గుర్తించి నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. ఈ మేరకు కార్యదర్శిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. అలాగే ఆ సమయంలో ప్రత్యేక అధికారిగా వ్యవహరించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భవానీకి క్రమశిక్షణ లోపంపై హెచ్చరిక నోటీస్ ఇచ్చారు.

పోలింగ్ విధులపై అవగాహన ఉండాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: పోలింగ్ విధులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. ఈనెల 27న జరిగే వరంగల్–ఖమ్మం–నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్‌తో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ విధానంపై సంబంధిత అధికారులకు నిర్వహించిన రెండో విడత శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని 12 పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. మంగళవారం (నేడు) ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లో ఎన్నికల సామగ్రి డిస్ట్రిబ్యూషన్ జరుగుతుందని, అధికారులు, సిబ్బంది సకాలంలో చేరుకోవాలని చెప్పారు. ఓటర్లు ఓటు వేయడానికి వచ్చిన సమయంలో వెంట తెచ్చుకున్న గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక కార్డు చివరి 4 అంకెలను సంబంధిత ఫార్మెట్‌లో నమోదు చేయాలన్నారు. దివ్యాంగ ఓటర్లకు సంబంధించి 18 ఏళ్లు నిండిన వారిని సహాయకులుగా అనుమతించాలని, కుడి చేతి చూపుడు వేలికి సిరా వేసి, సంబంధిత ధ్రువీకరణ తీసుకోవాలన్నారు. ఎన్నికలు ప్రారంభమైన సమయం నుంచి ప్రతీ రెండు గంటలకు ఒకసారి నమోదైన ఓటింగ్ వివరాలను పైఅధికారులకు తెలియజేయాలని సూచించారు. ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే సామగ్రిని జాగ్రత్తగా నిర్దేశిత ప్రదేశాలకు చేర్చాలని చెప్పారు. ఆర్డీఓలు గోపీరామ్, వెంకన్న, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీకాంత్, కలెక్టరేట్ ఏఓ మన్సూరీ పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయించొద్దు

జనగామ: ఫర్టిలైజర్స్ దుకాణాదారులు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రిజ్వాన్ బాషా హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని కావేరి, సాయిరాం ఫర్టిలైజర్స్, జేకేఎస్ అగ్రిమాల్‌ను డీఏఓ రామారావుతో కలిసి తనిఖీ చేశారు. ఎరువుల దిగుమతి, కొనుగోలు వివరాల రిజిస్టర్లను పరిశీలించారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులతో పాటు రశీదు ఇవ్వాలని, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం చేయొద్దని చెప్పారు. నకిలీల జోలికి వెళ్ల వద్దని, నాణ్యమైన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని సూచించారు. అనంతరం ఎరువుల నిల్వ గోదాంలను సందర్శించి యూరియా, ఇతర స్టాక్.. రిజిస్టర్లలో వివరాలను పరిశీలించారు. సాయిరాం ఫెర్టిలైజర్స్ షాపులో ధరల డిస్‌ప్లే బోర్డు లేకపోవడంతో యజమానిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జరిమానా విధించాలని డీఏఓను ఆదేశించారు. ఈ సందర్భంగా రైతులతో అధిక ధరల గురించి ఆరా తీశారు.

ఎమ్మెల్సీ రేసులో ఎవరెవరు?

ఎమ్మెల్యే కోటా కింద పెద్దలసభకు వెళ్లేదెవరు..?

- ఉమ్మడి వరంగల్‌లో జోరుగా ఊహాగానాలు
- సత్యవతి రాథోడ్‌కు మళ్లీ చాన్స్ దక్కేనా.. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేరు?
- కాంగ్రెస్ పార్టీ కోటాలో పెరుగుతున్న ఆశావహులు
- తెరమీదకు అసెంబ్లీ ఎన్నికల హామీలు.. పావులు కదుపుతున్న సీనియర్లు







సాక్షిప్రతినిధి, వరంగల్ : ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈ నెల 27న పోలింగ్ జరగనుంది. ఇదే సమయంలో వెలువడిన ఎమ్మెల్యే కోటా శాసనమండలి సభ్యుల ఎన్నికల నగారా మోగింది. మార్చి 3న నోటిఫికేషన్, 20న పోలింగ్ ఉండటంతో ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పుడు ఆ ఎన్నికలపై దృష్టి సారించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా ఐదు స్థానాలకు జరిగే ఎన్నికల సందర్భంగా ఇప్పుడున్న శాసనసభ్యుల సంఖ్య ప్రకారం బీఆర్ఎస్ తిరిగి ఒక్కస్థానం లభించే అవకాశం ఉంది. బీఆర్ఎస్ అధినేత ఈ ఐదుగురిలో మళ్లీ ఎవరికి చాన్స్ ఇస్తారు? ఉమ్మడి వరంగల్‌కు చెందిన సత్యవతి రాథోడ్ మళ్లీ అవకాశం ఉంటుందా? మరో సీనియర్‌కు అవకాశం కల్పిస్తారా? అన్న చర్చ ఆ పార్టీలో మొదలైంది. ఇదే సమయంలో కాంగ్రెస్‌కు నాలుగు ఎమ్మెల్సీలు దక్కే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆ పార్టీలో ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ టికెట్ రేసులో ఉండి.. అధిష్టానం హామీతో సీటు త్యాగం చేసిన ఆ పార్టీ సీనియర్లు ఇప్పుడు ఎమ్మెల్సీ పదవి ఆశిస్తున్నారు.

బీఆర్ఎస్ కోటాలో ఎర్రబెల్లి దయాకర్‌రావు పేరు?

ఎమ్మెల్యేల సంఖ్యాపరంగా చూస్తే ఈసారి కాంగ్రెస్– 4 స్థానాలు, బీఆర్ఎస్–1 స్థానం దక్కించుకునే అవకాశం ఉంది. బీఆర్ఎస్ తరఫున ఎన్నికైన మీర్జా రియాజుల్ హసన్, ఎగ్గే మల్లేశం, మహమూద్ అలీ, శేరి సుభాష్‌రెడ్డి, సత్యవతి రాథోడ్‌ల పదవీ కాలం మార్చి 29తో ముగియనుండగా.. సోమవారం ఈ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఈ నేపథ్యంలో ఒక్కస్థానంపై బీఆర్ఎస్‌లో తీవ్రస్థాయిలో జరుగుతోంది. ఉమ్మడి వరంగల్‌కు చెందిన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్‌కు మళ్లీ ఎమ్మెల్సీ దక్కుతుందా? అన్న చర్చ జరుగుతున్నప్పటికీ... ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా కూడా కొనసాగిన సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి దయాకర్‌రావు పేరుపై కూడా ప్రధానంగా చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించిన దయాకర్‌రావు పార్టీ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులతో సన్నిహితంగా ఉండటంతోపాటు పలు సందర్భాల్లో పార్టీ కార్యకలాపాల నిర్వహించడం ద్వారా తన ముద్ర వేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్‌కు ఎమ్మెల్సీ ఇవ్వదలచుకుంటే ఎర్రబెల్లి దయాకర్‌రావు పేరు కూడా పరిశీలనకు వచ్చే అవకాశం ఉందని పార్టీలో చర్చ జరుగుతోంది. ఐదు స్థానాల నుంచి ఒకే స్థానంతో సరిపెట్టుకునే పరిస్థితి ఏర్పడటంతో పార్టీ అధినేత కూడా ఆచితూచి వ్యవహరించే అవకాశం ఉందని అంటున్నారు.

కాంగి'రేసు'లో పలువురు.. సోమవారంనుంచే మొదలైన పైరవీలు..

వరంగల్ ఉమ్మడి జిల్లానుంచి ఎమ్మెల్సీలతోపాటు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్‌ల కోసం పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఇప్పటికే పోటీ పడుతున్నారు. గత శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యే టిక్కెట్లు దక్కని వారికి ప్రాధాన్యత ఇస్తామని ఎన్నికల సందర్భంగా పలువురికి టీపీసీసీ భరోసా ఇచ్చింది. ప్రధానంగా ప్రభుత్వ ప్రధాన సలహాదారుగా వేం నరేందర్‌రెడ్డి, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్‌లుగా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, డీసీసీబీ మాజీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, బెల్లయ్యానాయక్, ఐత ప్రకాష్‌రెడ్డి తదితరులకు.. కుడా చైర్మన్‌గా ఇనుగాల వెంకట్రాం రెడ్డిలకు అధిష్టానం అవకాశం కల్పించింది. ఎమ్మెల్యే, ఎంపీ టికెట్ రేసు నుంచి తప్పుకోవడంతో పాటు సీనియర్‌లుగా ఉన్న పలువురు ఎమ్మెల్సీ పదవి ఆశిస్తున్నారు. సోమవారంనుంచే కొందరు ఆశావహులు ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్, మంత్రుల, ఎమ్మెల్యేల ద్వారా పైరవీలు మొదలెట్టారు. ఉమ్మడి వరంగల్ నుంచి దొమ్మాటి సాంబయ్య, హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, సింగాపురం ఇందిర తదితరులు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని అధిష్టానాన్ని కోరుతున్నట్లు తెలిసింది. అలాగే రాష్ట్రస్థాయి కార్పొరేషన్ చైర్మన్‌లుగా పదవుల పొందిన వారిలో ముగ్గురు కూడా ఎమ్మెల్సీగా చాన్స్ ఇవ్వాలని అడుగుతున్నట్లు తెలిసింది. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ పదవి ఉమ్మడి వరంగల్‌కు దక్కుతుందా? ఒకవేళ ఇస్తే ఎవరికి? అనే అంశాలు తేలనున్నాయన్న చర్చ జరుగుతోంది.

'సేవ్ బర్డ్స్' చాలెంజ్‌కు అనూహ్య స్పందన



బోయినిపల్లిలో భీమ్‌రాజ్..



హైదరాబాద్‌లో కొండా చక్రపాణి..



హనుమకొండలో వేణుగోపాల్ ఇంటిపై..



లింగాలఘణపురంలో సతీష్..



యాదాద్రి జిల్లా శ్రీనివాసపురంలో పక్షుల కోసం మట్టి పాత్రలో నీరు పోస్తున్న మహిళ..

జనగామ: వేసవిలో పక్షుల దాహార్తి, ఆకలి తీర్చేందుకు అమ్మ ఫౌండేషన్ ఇచ్చిన చాలెంజ్‌కు మానవతా వాదులు స్పందించారు. 'సేవ్ బర్డ్స్' శీర్షికన ఈనెల 24న సాక్షిలో ప్రచురితమైన కథనం సోషల్ మీడియాలో ప్రముఖంగా నిలిచింది. అమ్మ ఫౌండేషన్ ముఖ్య సలహాదారు వంగ భీమ్‌రాజ్ హైదరాబాద్ బోయినిపల్లిలోని తన ఇంటిపై గింజలు, గిన్నెలో తాగునీరు పోసి చాలెంజ్ స్వీకరించారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన కొండా చక్రపాణి, హనుమకొండకు చెందిన వేణుగోపాల్, యాదాద్రి, జనగామకు చెందిన పలువురు పక్షుల ప్రాణాలను కాపాడడంలో తమవంతు పాత్ర ఉంటుందని అమ్మ ఫౌండేషన్‌కు లేఖ రాస్తూ.. 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు. పక్షుల రక్షణలో భాగస్వాములు కావాలని ఫౌండేషన్ వ్యవస్థాపకులు మంతెన మణి కోరారు.

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

జనగామ రూరల్: మహిళలు అభివృద్ధి సాధించాలి.. ఇందుకు వారికి అవసరమైన అవగాహన కల్పించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు ఆర్థిక అక్షరాస్యత మహిళా సాధికారతపై ఈనెల 24 నుంచి 28 వరకు నిర్వహిస్తున్న వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టరేట్‌లో ఆయన విడుదల చేశారు. నాలుగు రోజుల పాటు చేపట్టే ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, మహిళా దివ్యాంగులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీధర్, డీఆర్‌డీఓ వసంత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వ్యాపారంలో స్థిరత్వం అవసరం



హన్మకొండ: వ్యాపారంలో స్థిరత్వం, నైతిక బాధ్యత అవసరమని కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కె.రాజేందర్ అన్నారు. సోమవారం హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో రెండో రోజులు నిర్వహించే 'పినాకిల్ 2కే25' రాష్ట్ర స్థాయి సమ్మేళనం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ప్రొఫెసర్ కె.రాజేందర్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ అమరవేణి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ప్రొఫెసర్ కె.రాజేందర్ మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. కేయూ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ అమరవేణి మాట్లాడుతూ 'పినాకిల్ 2కే25' వంటి కార్యక్రమాలు విద్యావేత్తలు, కార్పొరేట్ ప్రపంచానికి మధ్య అంతరం తగ్గిస్తాయన్నారు. ఈ సమ్మేళనంలో రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కళాశాలల నుంచి 461 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే ప్రతిభాపాటవ పోటీల విజేతలకు రూ.60 వేల నగదు బహుమతి అందించనున్నారు. వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ శేషాచలం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కృష్ణమాచారి, ప్రొఫెసర్ రాజిరెడ్డి, డాక్టర్ ఎస్.మహేంద్ర కుమార్, డాక్టర్ పి.సుగుణాకర్ రెడ్డి పాల్గొన్నారు.

4న 'అకుట్' ఎన్నికలు

- ముగిసిన నామినేషన్ల ప్రక్రియ
- అధ్యక్ష పదవికి ముగ్గురు, జనరల్ సెక్రటరీకి నలుగురు నామినేషన్లు



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ అధ్యాపకుల సంఘం(అకుట్) ఎన్నికలు మార్చి 4వతేదీన నిర్వహించనున్నారు. కాగా నామినేషన్ల ప్రక్రియ సోమవారం సాయంత్రం ముగిసింది. అధ్యక్ష పదవికి ముగ్గురు.. జువాలజీ విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ బి.వెంకట్రామ్‌రెడ్డి, జియాలజీ విభాగం ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. జనరల్ సెక్రటరీ పదవికి నలుగురు.. బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.శ్రీనివాస్, మ్యాథమెటిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ ఎల్‌పి.రాజ్‌కుమార్, మైక్రోబయాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ ముంజం శ్రీనివాస్, కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ చిన్న నామినేషన్లు వేశారు. కేయూ అధ్యాపకుల సంఘం ఉపాధ్యక్షురాలిగా కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ సవితాజ్యోత్స్న, సంయుక్త కార్యదర్శిగా కొత్తగూడెం ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.రాము, కోశాధికారిగా క్యాంపస్‌లోని కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డి.రమేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయా పదవులకు ఒక్కో నామినేషన్ రావడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎరుపెక్కిన ఏనుమాముల..

మార్కెట్ యార్డుల్లో ఎటు చూసినా ఎర్ర బంగారమే

- 90 వేలకు పైగా వచ్చిన మిర్చి బస్తాలు
- పడిపోయిన ధరలతో రైతుల ఆవేదన

మార్కెట్‌లో మిర్చి బస్తాలు



వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ మిర్చితో ఎరుపెక్కింది. మార్కెట్ యార్డుల్లో ఎటు చూసినా ఎర్ర బంగారమే కనిపించింది. సీజన్ ఊపందుకోవడంతో రైతులు భారీ మొత్తంలో మిర్చి తీసుకొచ్చారు. బుధవారం మహా శివరాత్రి, గురువారం జాగరణ సెలవు, శుక్రవారం అమావాస్య, శనివారం యార్డు బంద్, ఆదివారం వారాంతపు సెలవుతో మార్కెట్ బంద్ ఉంటుంది. ఈ క్రమంలో మార్కెట్‌కు వరుసగా ఐదు రోజుల సెలవులు ఉన్న నేపథ్యంలో సోమవారం సుమారు 90వేలకు పైగా మిర్చి బస్తాలు వచ్చాయి. దీంతో ఏ యార్డులో చూసిన ఎర్రబంగారమే దర్శనమిచ్చింది. వేలాది బస్తాలు రావడం.. ఎండలు పెరుగుతుండడంతో మార్కెట్‌లోని హమాలీ కార్మికులకు కాంటాలు పెట్టడంలో జాప్యం జరిగింది. అన్ని రకాల మిర్చి రావడంతో ఘాటు పెరిగి కార్మికులు, రైతులు, ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు.

కాంటాలు జాప్యం..

మిర్చి యార్డుల్లో మార్కెట్‌లోని అన్ని యార్డులకు చెందిన ఉద్యోగులు పనిచేస్తున్నా కాంటాలు జాప్యమవుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. కాంటాల సమయానికి కమీషన్, కొనుగోలు దారులు లేకపోవడంతో ఈ జాప్యానికి కారణమని తెలుస్తోంది. మిర్చి అధికంగా రావడం.. ఎండతో ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో యార్డుల్లో వస్తున్న ఘాటుకు రైతులు తల్లడిల్లిపోతున్నారు.



కాంటాల కోసం నిరీక్షిస్తున్న రైతు

ధరలు ధమాల్..

గతేడాది సీజన్‌ను పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుత సీజన్‌లో మిర్చి ధరలు దారుణంగా పడిపోతున్నాయి. బంగ్లాదేశ్, ఇండోనేషియా దేశాలకు మన మిర్చి ఎక్కువ ఎగుమతి అయ్యేది. ప్రస్తుతం అంతర్జాతీయంగా చైనా పెద్ద ఎత్తున మిర్చిని ఇతర దేశాలకు ఎగుమతులు చేస్తోంది. దీంతో మన దేశంలో ధరలు పడిపోతున్నట్లు వ్యాపారవర్గాలు తెలిపాయి. గతేడాది తేజ మిర్చి ధర క్వింటాల్‌కు రూ.20వేల నుంచి రూ.22 వేల వరకు ఉండగా ప్రస్తుతం గరిష్ట ధర రూ.13,550కు పడిపోయింది. అదే విధంగా వండర్‌హాట్ రూ.22వేలు ఉండగా ప్రస్తుతం రూ.14వేలు, యూఎస్ రకం రూ.20వేలు ఉండగా ప్రస్తుతం రూ.13వేలు, దేశీ మిర్చి రూ.42వేలు ఉండగా సోమవారం రూ.27వేలు పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు. గతేడాదితో పోల్చుకుంటే క్వింటాల్ మిర్చికి రూ.5నుంచి 10వేలకు ధరలు తగ్గడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడుగా నల్లనల్లి తెగులు రావడంతో దిగుబడి పెద్ద మొత్తంలో తగ్గినట్లు వారు వాపోతున్నారు.

పక్క జిల్లాల నుంచి వస్తున్న మిర్చి..

వరంగల్ వ్యవసాయ మార్కెట్ ఆసియాలోనే అతి పెద్దదిగా పేరొందడంతో పక్క జిల్లాలో పండిన మిర్చి సైతం తరలివస్తోంది. పక్క జిల్లాలోని మార్కెట్‌లు చిన్నవి. దీంతో ఆ మార్కెట్‌లకు ఎక్కువ మిర్చి వస్తే ఒకటి, రెండు రోజులు సెలవు ప్రకటిస్తారు. వచ్చిన మిర్చి మొత్తం కాంటాలైన తర్వాతే మళ్లీ కొనుగోళ్లు చేపడతారు. వరంగల్ మార్కెట్‌లో మిర్చి నిల్వ సామర్థ్యం ఎక్కువ ఉండడంతో కొనుగోళ్లు నిలిచిపోకుండా సాగుతాయి. అందుకే రైతులు వరంగల్ మార్కెట్‌కు తీసుకొస్తారని మార్కెటింగ్ శాఖ ఉద్యోగులు తెలిపారు. తేజ రకం మిర్చి 30వేల బస్తాలు, వండర్‌హాట్ 10వేలు, యూఎస్-341 30వేలు, సింగిల్‌పట్టీ, డీడీ, దీపిక, దేశి, సన్నాలు, 1048 లాంటి రకాలు కలిపి 90వేలకు పైగా వచ్చినట్లు సమాచారం. తేజరకం రూ.13,550 నుంచి రూ.11వేలు, వండర్‌హాట్ రూ.14 వేల నుంచి రూ.12,వేలు, యూఎస్-341 రకం రూ.13,500 నుంచి రూ.10,500, దేశీ మిర్చి రూ.27 వేల నుంచి రూ.22 వేల వరకు ధరలు పలికాయి.

మచ్చకాయకు వచ్చిన ధర రావడం లేదు..



నేను రెండు ఎకరాల్లో సింజెటా(2043)రకం సాగు చేశా. గతేడాది ఇదే రకం మచ్చకాయ ఉన్నప్పటికీ క్వింటాల్‌కు రూ.30 వేల ధర లభించింది. ఇప్పుడు కాయ నాణ్యతతో ఉన్నప్పటికీ క్వింటాల్‌కు రూ.11,500 ధరే లభించింది. గతేడాది రూ. రెండు లక్షలు వచ్చాయి. ఇప్పుడు దిగుబడి, ధరలు తగ్గాయి. సరుకు మొత్తం అమ్మినా రూ.లక్ష వరకు కూడా రావడం లేదు. అప్పులు మిగిలే పరిస్థితులే ఉన్నాయి.

- వేణుగోపాల్, పరమల్ గ్రామం, గద్వాల జిల్లా

ధరలు పడిపోయాయి..



నేను ఎకరంలో మిర్చి యూఎస్-341రకం సాగు చేశా. రోగాలతో 11 బస్తాలు మాత్రమే దిగుబడి వచ్చింది. ఇక్కడకు వచ్చాక ధరలు కూడా తగ్గాయి. గతేడాది క్వింటాల్‌కు రూ.13,500 ధర పలకగా ఈసారి నాణ్యత ఉన్నప్పటికీ రూ.11వేలకు కొనుగోలు చేశారు.

- పెండ్లి శ్రీనివాస్, ఇస్సిపేట, మొగుళ్లపల్లి మండలం

పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు..



నేను రెండు ఎకరాల్లో తేజ రకం మిర్చి పండించా. కాయలో నాణ్యత ఉన్నప్పటికీ ధరలు పెట్టడం లేదు. గతేడాది ఇదే రకం మిర్చిని రూ.21వేలకు అమ్మినా. ఇప్పుడు రూ13,500కు అడుగుతున్నారు. పెట్టుబడి వచ్చే పరిస్థితులు కానరావడం లేదు.

- ధారావత్ దేవరావ్, బండల ఖానాపూర్, నిర్మల్ జిల్లా

ఎగుమతులు లేక ధరలు తగ్గాయి..



ఎగుమతులు లేకపోవడంతోనే మిర్చి ధరలు తగ్గుతున్నాయి. దీనికి తోడు పంట దిగుబడి తగ్గడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధరలు తగ్గడంతో మార్కెట్ ఆదాయం సైతం తగ్గే అవకాశాలు ఉన్నాయి.

- జి.రెడ్డి, మార్కెట్ కార్యదర్శి, వరంగల్

మిర్చికి రూ. 25వేల మద్దతు ధర చెల్లించాలి

- సీఎం రేవంత్ రాజకీయాలు పక్కన పెట్టాలి
- మిర్చి, పసుపు రైతుల కష్టాలపై దృష్టి సారించాలి
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



కేసముద్రం మార్కెట్‌లో మిర్చి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

మహబూబాబాద్/కేసముద్రం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మిర్చి, పసుపు రైతుల కష్టాలపై దృష్టి సారించి మిర్చికి రూ. 25 వేల మద్దతు ధర చెల్లించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మానుకోటలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అలాగే, కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ ఏపీ సీఎం చంద్రబాబు మిర్చి రైతుల కోసం ఢిల్లీలో సంబంధిత కేంద్రమంత్రితో మాట్లాడి మద్దతు ధర కోసం ప్రయత్నాలు చేస్తుంటే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం రైతులను పట్టించుకోవడం లేదన్నారు. ప్రధానమంత్రి మోదీ కాళ్లు పట్టుకునైనాసరే మిర్చి రైతులకు క్వింటాల్‌కు రూ.25 వేలు అందించి న్యాయం చేయాలన్నారు. మహబూబాబాద్ ప్రాంతానికి చెందిన నాయకుడు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి.. సీఎం చుట్టే తిరుగుతుంటాడని, వారి అనుబంధం ఎంత గట్టిదంటే ఓటు నోటు కేసులో ఏ-1, ఏ-2, ఏ-3 అంతదంటూ ఎద్దేవా చేశారు. నరేందర్ రెడ్డి ఒక్కసారైనా మిర్చి, పసుపు రైతుల బాధలు సీఎం దృష్టికి తీసుకెళ్లే సమయం లేదా అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఎల్‌ఎల్‌బీసీ సొరంగంలో ప్రమాదం జరిగి కార్మికుల గల్లంతైతే కనీసం సీఎం రేవంత్ ఆ ప్రాంతాన్ని సందర్శించలేదన్నారు. మిర్చి, పసుపు రైతులు, సొరంగంలో గల్లంతైన కూలీల విషయంలో సీఎం రేవంత్ మానవత్వం లేకుండా వ్యవహరిస్తూ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటికైనా రాజకీయాలు పక్కన పెట్టి పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. అలాగే, ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ. 12వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పూర్తి స్థాయిలో రుణమాఫీ కాలేదని, రైతులు అప్పుల పాలై ఆత్మహత్య చేసుకుంటున్నారని కురవి మండలం తుల్స్యా తండాకు చెందిన యువ రైతు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, కేసముంద్రం మండలం అమీనాపురంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్సీ పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, మాజీ ఎంపీ, పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు రెడ్యానాయక్, శంకర్‌నాయక్, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బిందు, తదితరులు పాల్గొన్నారు.

మిర్చి ధరలపై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

- ఏఐకేఎస్ కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి



మార్కెట్ వద్ద మాట్లాడుతున్న రంగారెడ్డి

వరంగల్: మిర్చి ధరల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆల్ ఇండియా కిసాన్ సభ కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఏనుమాముల మార్కెట్‌ను నాయకులు ఈసంపల్లి బాబు, గాదె ప్రభాకర్‌రెడ్డి, ఎం.సుక్కయ్య, ఎండి. బషీర్‌తో కలిసి సందర్శించి రైతులను మిర్చి ధరల గురించి తెలుసుకున్నారు. ఈసందర్భంగా రైతులు మిర్చికి ఎకరానికి పెట్టుబడి సుమారు రూ. లక్షాయాభై వేలు ఖర్చు వస్తుందని, ఎకరానికి దిగుబడి 10 నుంచి 20 క్వింటాళ్లు వస్తుందన్నారు. ధర రూ.10 వేల నుంచి రూ.12వేల వరకు మాత్రమే రావడంతో నష్టాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతవారం రూ.15వేలు ఉండగా నేడు రూ. 2వేలు తగ్గించారని ఆరోపించారు. అనంతరం రంగారెడ్డి మాట్లాడుతూ గతేడాది కంటే ఈఏడాది మిర్చి సాగు సుమారు లక్షన్నర ఎకరాలు తగ్గినప్పటికీ ధర దారుణంగా పడిపోవడం దుర్మార్గమని, ఇది ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో అట్మల్ పాషా, గన్నారపు ప్రభాకర్, దార కుమారస్వామి, లక్కరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని మోసం..

- నిరుద్యోగుల వద్ద భారీగా డబ్బు వసూలు
- నిందితుడి అరెస్ట్, రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఇన్‌స్పెక్టర్ మహేందర్



నిందితుడితో ఇన్‌స్పెక్టర్ మహేందర్, సిబ్బంది

గీసుకొండ: సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తానంటూ నిరుద్యోగులను మోసం చేసిన ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. గీసుకొండ ఇన్‌స్పెక్టర్ మహేందర్ కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా హనుమాన్‌నగర్‌కు చెందిన హరిగొప్పుల రాహుల్ హైదరాబాద్‌లో గ్లోబల్ ఐటీ సొల్యూషన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో హెచ్‌ఆర్ అడ్మిన్‌గా పని చేస్తున్నాడు. వేతనం సరిపోకపోవడంతో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురాశ కలిగింది. ఈ క్రమంలో వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఎలుకుర్తిహవేలికి చెందిన నిరుద్యోగులు పృథ్వీ, దీపక్‌కు రాహుల్ హైదరాబాద్‌లో పరిచయమయ్యాడు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి ఒక్కొక్కరి వద్ద రూ. 2.50 లక్షల చొప్పు మొత్తం రూ. 5 లక్షలు తీసుకోవడంతో పాటు వారికి ఫేక్ ఆన్‌లైన్ ఇంటర్వ్యూ నిర్వహించాడు. అనంతరం మాగ్నెక్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం వచ్చిందని 2024 జనవరి 2న ఫేక్ నియామకపత్రం ఇచ్చాడు. అదే ఏడాది ఫిబ్రవరిలో పృథ్వీ బంధువు అయ్యప్పపల్లికి చెందిన ఎటుకాల పవన్‌కుమార్, అతడి స్నేహితులు కొడగాని సాయిపవన్, కొపంపెల్లి లక్ష్మణ్‌రెడ్డి, గుండగాని రాజు, టికిరె సాయికృష్ణ, మాణికరావు సాయికుమార్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి ఒక్కొక్కరి నుంచి రూ. 2.50 లక్షలు వసూలు చేశాడు. వారందరికీ ట్రెనింగ్‌లో నెలకు రూ. 20 వేలు, ఆరు నెలల తర్వాత నెలకు రూ. 40 వేల వేతనం ఇప్పిస్తానంటూ హైదరాబాద్‌లో నాలుగు నెలల ట్రైనింగ్ ఇప్పించాడు. అనంతరం ఓ నెల వేతనం కింద ఒక్కొక్కరికి రూ. 20 వేల చొప్పున ఇచ్చి కంపెనీని మూసివేస్తున్నామని, మే నెలలో మీరు ఇచ్చిన డబ్బులను పూర్తిగా తిరిగి చెల్లిస్తానని తిప్పుతున్నాడు. దీంతో గతేడాది అక్టోబర్ 19న సిరిసె రాజేశ్వర్‌రావు అనే వ్యక్తి రాహుపై ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా రాహుల్ ఈనెల 23న జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం వెల్లంపల్లిలోని తన మేనమామ ఇంటి వద్ద ఉన్నాడనే సమాచారం మేరకు ఎస్సై ప్రశాంత్‌బాబు అక్కడికివెళ్లి రాహుల్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరు పర్చగా జేఎఫ్‌సీఎం ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్.. రాహుల్‌కు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు.

భక్తులకు శుభవార్త..

- మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు
- ఈ నెల 25, 26, 27 తేదీల్లో నడుపుతున్న సంస్థ..
- వరంగల్ రీజియన్‌లోని వివిధ ఆలయాలకు 255 బస్సులు




హన్మకొండ: భక్తులకు శుభవార్త. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రముఖ శైవ క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల పరిధిలో 255 బస్సుల ద్వారా ఈ నెల 25, 26, 27 తేదీల్లో కాళేశ్వరం, వేములవాడ, పాలకుర్తి, రామప్పకు భక్తులను సురక్షితంగా చేరవేసేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భూపాలపల్లి డిపో ద్వారా హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి కాళేశ్వరానికి 30 బస్సులు, పరకాల డిపో ద్వారా 20, వరంగల్-2 డిపో ద్వారా నాలుగు మొత్తం 54 బస్సులు నడపనున్నారు. వరంగల్-1 డిపో ద్వారా హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి పాలకుర్తికి 5 బస్సులు, తొర్రూరు డిపో ద్వారా 14 బస్సులు (మొత్తం 19) నడుపుతారు. మహబూబాబాద్ డిపో ద్వారా మహబూబాబాద్ నుంచి కురవికి 41 బస్సులు, జనగామ డిపో ద్వారా జనగామ నుంచి కొమురవెల్లికి 50, హనుమకొండ డిపో ద్వారా నగరంలో మడికొండ మెట్టుగుట్టకు 2, వరంగల్-2 డిపో ద్వారా హనుమకొండ నుంచి రామప్పకు 17, పరకాల డిపో ద్వారా ఒకటి మొత్తం 18 బస్సులు నడపనున్నారు. అదే విధంగా హనుమకొండ బస్టాండ్ నుంచి ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు వేములవాడకు నడిపించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. అలాగే, భక్తుల రద్దీకి అనుగుణంగా హనుమకొండ బస్టాండ్ నుంచి కాళేశ్వరం, రామప్ప, పాలకుర్తికి బస్సులు నడిపేలా ప్రణాళిక రూపొందించారు. ప్రయాణికులకు సేవలు, సలహాలు అందించేందుకు హనుమకొండ, వరంగల్, వేములవాడ, కాళేశ్వరం, పాలకుర్తి, ఐనవోలు, కొమురవెల్లి బస్టాండ్లలో సిబ్బందిని నియమించారు.

ప్రత్యేక బస్సుల చార్జీల వివరాలు..

హనుమకొండ నుంచి కాళేశ్వరం రూ. 250 నిర్ణయించారు. హనుమకొండ నుంచి వేములవాడ రూ.210, హనుమకొండ నుంచి రామప్ప రూ.140, హనుమకొండ నుంచి పాలకుర్తి రూ.90, వరంగల్ నుంచి మెట్టుగుట్ట రూ.50, వరంగల్ నుంచి ఐనవోలు రూ.50, మహబూబాబాద్ నుంచి కురవి రూ.30, జనగామ నుంచి కొమురవెల్లి రూ.100, తొర్రూరు నుంచి పాలకుర్తి రూ.100 నిర్ణయించారు.

భక్తులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



ఆర్టీసీ వరంగల్ రీజియన్‌లోని వివిధ శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. భక్తులు ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా బస్టాండ్లలో ఆర్టీసీ అధికారులను నియమించాం. ఆర్టీసీ బస్సులో ప్రయాణించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి.

-డి.విజయభాను, రీజినల్ మేనేజర్, వరంగల్

మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ సభ్యురాలి లొంగుబాటు




పునరావాస చెక్కు అందజేస్తున్న ఎస్పీ శబరీశ్

ములుగు: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం గ్రామానికి చెందిన పుల్సం పద్మ అలియాస్ ఊరె సోమవారం ములుగు ఎస్పీ శబరీశ్ ఎదుట లొంగిపోయింది. పద్మ ప్రస్తుతం సీఆర్‌బీ ప్రెస్ టీం డికేస్‌జెడ్‌సీ డివిజనల్ కమిటీ సభ్యురాలిగా పని చేస్తోంది. మావోయిస్టు సిద్ధాంతాలపై విసుగు చెంది కుటుంబ సభ్యులతో ప్రశాంత జీవితం గడపాలనే ఉద్దేశంతో పద్మ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. పద్మ పీడబ్ల్యూజీ సిద్ధాంతాలకు ఆకర్షితులై 1998లో సీపీఐ ఎంఎల్‌లో చేరింది. 2001 వరకు ఏటూరునాగారం దళంలో పార్టీ సభ్యురాలిగా కొనసాగింది. అదే ఏడాది మహిళా దళానికి బదిలీ అయి 2004 వరకు కొనసాగింది. 2005లో దళ కమాండర్‌గా నియమితులైంది. అదే సంవత్సరం సీసీఎంగా ఉన్న కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్‌ను వివాహం చేసుకుని రక్షణ విభాగానికి బదిలీ అయ్యింది. ఒత్తిడి కారణంగా భర్త ఆనంద్‌తో కలిసి డికేస్‌జెడ్‌సీ కి బదిలీ అయి ఏసీఎంగా పదోన్నతి పొందింది. 2002 నుంచి 2020 వరకు అనేక కేసుల్లో నిందితురాలిగా ఉంది. ఈ మేరకు లొంగిపోయిన పద్మకు ప్రభుత్వం ప్రకటించిన రివార్డును ఎస్పీ శబరీష్ చెక్కు రూపేణ అందించారు. పునరావాసం కల్పించి అన్ని విధాలా ఆదుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ మహేశ్ బి గీతే, ములుగు డీఎస్పీ రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

రియల్ టైం డేటా ప్రణాళిక సిద్ధం

- టీజీ ఎన్పీడీసీఎల్ ఎండీ వరుణ్‌రెడ్డి




మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

హన్మకొండ: సబ్‌స్టేషన్ నుంచి రియల్ టైం డేటా పొందడానికి ప్రణాళిక రూపొందించామని, ఇందులో భాగంగా ముందు టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో వంద సబ్‌స్టేషన్లు గుర్తించినట్లు టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో 16 జిల్లాలకు చెందిన ఎంఆర్‌టీ విభాగం డీఈ, ఏడీ, ఏఈల సమీక్ష సమావేశం జరిగింది. సీఎండీ మాట్లాడుతూ దశలవారీగా అన్ని సబ్‌స్టేషన్లలో రియల్ టైం డేటా పొందటానికి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ వంద సబ్ స్టేషన్లలో రియల్ టైం డేటా పనులు మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభమవుతాయన్నారు. వినియోగదారులకు మరింత మెరుగైన విద్యుత్ అందించడానికి ఈ డేటా కీలకమన్నారు. ఇన్‌చార్జి డైరెక్టర్ బి.అశోక్‌కుమార్, సీజీఎం కె.కిషన్, అశోక్, జీఎంలు అన్నపూర్ణ, డీఈలు సదానందం, దర్శన్‌కుమార్, హర్షి జాటోతు, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- తండావాసుల డిమాండ్
- నిత్యశ్రీ మృతదేహంతో ధర్నా



ధర్నా చేస్తున్న తండావాసులు

డోర్నకల్: డోర్నకల్ మండలం జోగ్యా తండాలో సోమవారం చిన్నారి నిత్యశ్రీ(5) మృతదేహం ఉన్న అంబులెన్స్‌ను అడ్డుకుని తండావాసులు ధర్నా నిర్వహించారు. జోగ్యాతండాకు చెందిన నిత్యశ్రీకి ఈ నెల 5న తల్లి ఉష కూల్‌డ్రింక్‌లో గడ్డిమందు కలిపి తాగించడంతో హైదరాబాద్ నిలోఫర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందింది. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో అంబులెన్స్ జోగ్యాతండాకు చేరుకోగా తండావాసులు అడ్డగించి ఆందోళన చేపట్టారు. నిత్యశ్రీ మృతికి కారణమైన తల్లి ఉషతోపాటు ఇతరులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డోర్నకల్, బయ్యారం సీఐలు బి.రాజేశ్, రవికుమార్ తండాకు చేరుకుని ఆందోళనకారులకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకుండా రాత్రంతా రోడ్డుపైనే బైఠాయించారు. సోమవారం ఉదయం కూడా ఆందోళన కొనసాగించారు. దీంతో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, రమేశ్, వెంకన్న తదితరులు సీఐ రాజేశ్‌తో కలిసి నిత్యశ్రీ నానమ్మ, తాతయ్యతో పాటు బంధువులతో చర్చలు జరిపారు. విచారణ చేపట్టి నిందితులను శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం చిన్నారి అంత్యక్రియలు పూర్తి చేశారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న నిత్యశ్రీ తల్లి ఉష అంత్యక్రియలకు హాజరుకాలేదు.

వైభవంగా మల్లన్న బ్రహ్మోత్సవాలు..

- మొదటి రోజు ఉదయం సూర్యప్రభ వాహనసేవ



సూర్యప్రభ వాహన సేవలో ఈఓ నాగేశ్వరరావు, సీఐ రాజగోపాల్, ఎస్సై శ్రీనివాస్, అర్చకులు

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఒగ్గు పూజారుల మేలు కొలుపుతో స్వామివారు మేల్కోగా అర్చకులు వేదమంత్రాలతో నిత్య పూజలు నిర్వహించారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజు ఉదయం ఉత్సవ మూర్తులతో సూర్యప్రభ వాహనసేవ నిర్వహించగా ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు శ్రీనివాస్, మధుకర్ శర్మ, వేద పండితులు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి మాడవీధుల్లో భక్తులకు దర్శనం గావించారు. అనంతరం యాగశాల ప్రవేశం చేసి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, ఋత్విక్ కరణ, దీక్షాధారణ, అఖండ దీప స్థాపన, అస్త్రరాజార్చన, బలిహరణతో ఉదయం పూజలు పూర్తిచేశారు. సాయంత్రం మృత్ సంగ్రహణ, అంకురార్పణ, అగ్ని మదన-అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు.

ధ్వజారోహణంతో ప్రారంభం..

నూతన వస్త్రంపై నందీశ్వరుడి చిత్రాన్ని లిఖించారు. ఆ వస్త్రాన్ని మల్లికార్జున స్వామివారి ధ్వజస్తంభ శిఖరాగ్రాన ఎగురవేశారు. అర్చకులు దీనిని ధ్వజారోహణం అంటారు. నందీశ్వరుడు తన ప్రభువైన మల్లికార్జునుడికి జరగబోతున్న బ్రహ్మోత్సవాలకు ఊర్ధ్వ లోకాల్లోని సకల దేవతాగణాలు రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నట్లు ఆ సమయంలో వేదపండితులు మంత్ర పఠనం చేశారు. దీంతో బ్రహ్మోత్సవ జాతర ప్రారంభమైనట్లు ఆలయ అర్చకులు ప్రకటించారు. అనంతరం రాత్రి చంద్రప్రభ వాహనసేవ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పర్వతగిరి సీఐ రాజగోపాల్, ఎస్సై శ్రీనివాస్‌తో పాటు అర్చకులు నందనం భానుప్రసాద్ శర్మ, నందనం మధుశర్మ, పాతర్లపాటి నరేశ్‌శర్మ, ఉప్పుల శ్రీనివాస్, దేవేందర్, జూనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.